

www.vibharenews.com

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 16-12-2022 సంపుటి : 04 సంచిక : 102 పేజీలు : 4 వెల : రూ 3-00

# నాణ్యతలో రాజీ పడొద్దు..



## సీఎం జగన్ కీలక ఆదేశాలు

### మహిళా శిశు సంక్షేమ శాఖపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: మహిళా శిశు సంక్షేమ శాఖపై తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతిని సీఎం అధికారులు వివరించారు. అంగన్‌వాడీలలో ఖాళీగా ఉన్న సీడీపీఓ పోస్టుల వివరాలను సీఎంకు అందించారు. ఖాళీగా ఉన్న సీడీపీఓ పోస్టుల భర్తీకి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 61 సీడీపీఓ పోస్టుల భర్తీకి సీఎం ఆమోదం తెలిపారు. వాటి నియామకాలు ఏపీపీఎస్సీ ద్వారా చేపట్టనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.సీడీపీఓ పోస్టుల భర్తీని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. వాటితో పాటు ఇంకా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. అంగన్‌వాడీలలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. నాడు-నేడు కింద చేపడుతున్న పనులను వేగవంతం చేయాలన్న సీఎం.. సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీలలో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు, పిల్లలు వికాసం చెందేలా మంచి వాతావరణాన్ని కల్పించడం ముఖ్యమని సీఎం పేర్కొన్నారు.అంగన్‌వాడీలలో సార్టెక్స్ రైస్ సరఫరా చేయాలిన్యూట్రిషన్ కిట్ సరఫరాలో నాణ్యత విషయంలో అస్సలు రాజీ పడొద్దుపిల్లలకు ఇచ్చే న్యూట్రిషన్ కిట్ నాణ్యత కచ్చితంగా అత్యున్నత ప్రమాణాలతో ఉండాలిఅంగన్‌వాడీలలో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలలో అన్నింటా క్వాలిటీ పెరగాలి. ఆ ఫలితాలు కనబడాలి. గతంలో కన్నా పిల్లలకు మంచి చేస్తున్నామన్న సంతృప్తి కలగాలిఅందుకోసం కావాల్సిన వసతులు, సదుపాయాలు పూర్తిగా కల్పించాలిఅంగన్‌వాడీల్లో కరికులమ్ (బోధనాంశం) కూడా మారాలి. ఎందుకంటే పిల్లలకు చిన్న వయసులోనే మెదడు తొందరగా పరిణతి చెందుతుంది. ఏ విషయాన్ని అయినా త్వరగా గ్రహించగలుగుతారు. ఇంకా వారికి మంచి అవగాహన కూడా ఏర్పడుతుందికరికులమ్ మార్పు కోసం అవసరం అయితే ప్రత్యేక అధికారిని నియమించాలికొత్తగా అందుబాటులోకి వచ్చిన సూపర్‌వైజర్ల సహాయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలన్న సీఎంతనిఖీలు, నాణ్యత, నాడు-నేడు ఈ మూడు అంశాలకు సంబంధించి కచ్చితమైన మార్పు కనిపించాలన్న సీఎంఅగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హెల్త్, హౌసింగ్, మహిళా శిశు సంక్షేమ శాఖలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందివీటిలో మార్పుల కోసం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రిసిబ్బంది నియామకాలు సహా... ఏ రకమైన అవసరం ఉన్నా ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందిఅయితే ఆ మేరకు కచ్చితమైన ఫలితాలు కూడా రావాల్సి ఉందన్న సీఎంసూపర్‌వైజర్స్ సక్రమంగా పని చేయాలి. వీరి పనితీరుపైనా పర్యవేక్షణ ఉండాలన్న సీఎంసూపర్‌వైజర్స్ వ్యవస్థ ద్వారా అంగన్‌వాడీలలో పనితీరు మెరుగవడంతో పాటు నాణ్యత కూడా పెరుగుతుందన్న సీఎంఅంగన్‌వాడీల నుంచే పిల్లలకు భాషపై గట్టి పునాది అందించాలన్న సీఎంపిల్లలకు ఉత్తమ అభ్యాసాలు ఉండాలన్న ముఖ్యమంత్రిమహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, సీఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, మహిళ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, పాఠశాల విద్యాశాఖ (మౌలిక సదుపాయాలు) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, పౌర సరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండ్యన్, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే ఇతర ఉన్నతాధికారులు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.

# లాడెన్‌కు ఆశ్రయమిచ్చిన మీరా మాట్లాడేది..?

## పాక్‌పై జైశంకర్ ఘాటు విమర్శలు




యునైటెడ్ నేషన్స్: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన దాయాది పాకిస్థాన్ కు భారత్ మరోసారి గట్టిగా బదులిచ్చింది.ఒసామా బిన్ లాడెన్ లాంటి భీకర ఉగ్రవాదికి ఆశ్రయం కల్పించిన దేశానికి.. పొరుగు దేశ పార్లమెంట్‌పై దాడికి పాల్పడిన వారికి ఐరాస(జఔ) వంటి ప్రపంచ వేదికపై 'సుద్దులు' చెప్పే అర్హత లేదని స్పష్టం చేసింది. ఐరాస భద్రతా మండలి చర్చా కార్యక్రమంలో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకంపాల్గొని ప్రసంగించారు. ఉగ్రవాదానికి ఊతమిచ్చేవారిని రక్షించడానికి అంతర్జాతీయ వేదికలను కొన్ని దేశాలు దుర్వినియోగం చేస్తున్నాయని పరోక్షంగా చైనా, పాకిస్థాన్‌లపై ఘాటు విమర్శలు చేశారు.ఐరాస భద్రతా మండలిలో 'అంతర్జాతీయ శాంతి భద్రతల నిర్వహణ-సంస్కరణల'పై చర్చ జరుగుతుండగా పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీంతో అక్కడే ఉన్న జైశంకర్.. దాయాదికి దీటుగా బదులిచ్చారు. ''సమస్యలపై ఉత్తమ పరిష్కారం కోసం శోధిస్తున్నప్పుడు ఇలాంటి ముప్పులను(పాకిస్థాన్‌ను ఉద్దేశిస్తూ) సాధారణంగా తీసుకోకూడదు. ప్రపంచం మొత్తం ఆమోదించని వాటిని సమర్థించాలనే ప్రశ్నే తలెత్తకూడదు. సీమాంతర ఉగ్రవాదాన్ని వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న దేశాలకు కూడా ఇది వర్తిస్తుంది. ఒసామా బిన్ లాడెన్ లాంటి ఉగ్రవాదికి ఆతిథ్యమిచ్చిన వారికి.. పొరుగుదేశ పార్లమెంట్‌పై దాడి చేసిన దేశానికి ఐరాసలో ఇతరులకు ప్రబోధించే అర్హత లేదు" అని జైశంకర్ గట్టిగా చెప్పారు. కొన్ని దేశాలు అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేస్తూ ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్నాయని పాక్, చైనాపై పరోక్ష విమర్శలు చేశారు. కరోనా మహమ్మారి ముప్పు, పర్యావరణ మార్పు, ఉగ్రవాదం.. ఇలాంటి కీలక సవాళ్లపై సమర్థవంతంగా ప్రతిస్పందిస్తేనే ఐరాసపై విశ్వసనీయత పెరుగుతుందన్నారు.కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని జైశంకర్ మరోసారి అంతర్జాతీయ సమాజానికి స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని పాక్ ఇకనైనా అంగీకరించి.. భారత వ్యతిరేక ప్రచారాన్ని ఆపాలంటూ హితవు పలికారు. ఉగ్రవాదం, శత్రుత్వం, హింసకు తావు లేని వాతావరణంలో మాత్రమే తాము ఇస్లామాబాద్‌తో సంబంధాలను కోరుకుంటున్నామని ఐరాస వేదికగా భారత్ మరోసారి స్పష్టం చేసింది.ప్రస్తుతం ఐరాస భద్రతా మండలికి భారత్ అధ్యక్షత వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలు, తీసుకురావాల్సిన బహుళ పాక్షిక సంస్కరణలపై చర్చించేందుకు జైశంకర్ మంగళవారం ఐరాస కార్యాలయానికి చేరుకున్నారు. నిన్న ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌తో కలిసి అక్కడి ఆవరణలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

# ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించిన సజ్జల



తాడేపల్లి: ముఖమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా(డిసెంబర్ 21) ప్రత్యేక వెబ్‌సైట్‌ను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు.అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో కోట్లాది మంది అభిమానులు పాల్గొంటారని, సంక్షేమ పథకాలతో లబ్దిపొందిన వారంతా పాల్గొంటారన్నారు.గతంలో పార్టీ కార్యకర్తలు 38వేల యూనిట్ల రక్తదానం చేశారని, ఈసారి వైఎస్సార్‌సీపీ బ్లడ్ డొనేషన్. కామ్ పేరిట వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్లడ్ డొనేషన్‌కు పేర్లు నమోదు చేసుకుంటే అవసరమైనప్పుడు రక్తదానం చేసే అవకాశం ఉందన్నారు. ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని, 20న మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు సజ్జల తెలిపారు. 21వ తేదీన పేదలకు అన్నదానం వంటి సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఏపీ, తెలంగాణ సహా ఆ 6 రాష్ట్రాల్లోనే పెట్రో ధరలెక్కువ: కేంద్రం



దిల్లీ: దేశంలో భాజపాయేతర పార్టీలు పాలిస్తున్న ఆరు రాష్ట్రాల్లో పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ (ఎంు) తగ్గించలేదని కేంద్రం తెలిపింది.దీంతో ఆయా రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని పేర్కొంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, ఝార్ఖండ్‌లో వ్యాట్ (ఎంు) తగ్గించలేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ గురువారం లోక్‌సభలో తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినట్లు హర్దీప్ సింగ్ గుర్తుచేశారు. దీనికి కొనసాగింపుగా కొన్ని రాష్ట్రాలు ప్రజలపై భారం తగ్గించడం కోసం వ్యాట్ (ఎంు)ను సైతం తగ్గించాయని తెలిపారు. లోక్‌సభలో మంత్రి ఈ ప్రకటన చేస్తుండగా ప్రతిపక్ష పార్టీల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చౌకగా పెట్రోల్ లభిస్తున్న దేశాల జాబితాలో భారత్ ఒకటని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం వల్ల దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రూ.27,276 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తమ తమ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్ (ఎంు)ను తగ్గించేందుకు ఒప్పించాలని ప్రతిపక్ష పార్టీల లోక్‌సభ సభ్యులను హర్దీప్ సింగ్ కోరారు. భారత చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లోని ధరలకు అనుగుణంగానే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలుఉంటాయని పేర్కొన్నారు. అలాగే వినియోగదారులకు విక్రయించే ధరలో చమురు కొనుగోలు ఖర్చు, మారకపు రేటు, రవాణా వ్యయం, రిఫైనరీ మార్జిన్, డీలర్ కమిషన్, కేంద్ర ప్రభుత్వ పన్నులు, రాష్ట్ర ప్రభుత్వ వ్యాట్ వంటివన్నీ భాగమై ఉంటాయన్నారు.2020 నవంబరు నుంచి 2022 నవంబరు మధ్య భారత్ కొనుగోలు చేసిన చమురు ధర సగటున 102 శాతం పెరిగినట్లు హర్దీప్ సింగ్ తెలిపారు. అదే సమయంలో దేశీయంగా పెట్రోల్ రిటైల్ ధర 18.95 శాతం, డీజిల్ ధర 26.5 శాతం మాత్రమే పెరిగిందని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఏడాది ఏప్రిల్ 6 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరల్ని సవరించలేదని హర్దీప్ సింగ్ లోక్‌సభకు తెలిపారు. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో కంపెనీలు రూ.27, 276 కోట్ల నష్టాల్ని చవిచూసినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరల ప్రభావం సామాన్యులపై ఉండొద్దనే కేంద్ర ప్రభుత్వం రెండు సార్లు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని అన్నారు.

# వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములుకు సీఎం జగన్ నివాళి

తాడేపల్లి: భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు.తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఇరువురి చిత్రపటాలకు పూలు సమర్పించి అంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పాల్గొన్నారు.

# నవయుగ కంపెనీకి సుప్రీంకోర్టులో షాక్

ఢిల్లీ: మచిలీపట్నం పోర్టు పనుల రద్దుపై నవయుగ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. భూమి కేటాయించినా పోర్టు నిర్మించడంలో నవయుగ ఆలస్యం చేసిందని కాంట్రాక్టును ఏపీ ప్రభుత్వం రద్దు చేసింది.త్వరితగతిన పోర్టు నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యమని ఏపీ ప్రభుత్వం తెలిపింది.



# మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో రెండో రోజు సోదాలు





హైదరాబాద్: మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో రెండో రోజు కూడా సోదాలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లను సేకరించి చిట్టీల సొమ్మును ఇతర సంస్థల్లోకి మళ్లించిన మార్గదర్శి చిట్‌ఫండ్ వ్యవహారాలపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. అధికారుల తనిఖీలను వీడియో కెమెరాలల్లో చిత్రీకరిస్తున్నారు. సొంత మీడియాతో అధికారుల విధులకు మార్గదర్శి యాజమాన్యం ఆటంకం కలిగిస్తోంది. పలు కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డిస్క్ లోని సమాచారం అధికారులు సేకరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫిక్స్ డిపాజిట్లు సేకరించినట్టు అనుమానం వ్యక్తమవుతుంది. ఇతర గ్రూప్ ఆఫ్ కంపెనీలకు మర్గదర్శి నిధుల మళ్లింపుపై అధికారులు ఆరా తీస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మార్గదర్శి కార్యాలయాల్లో మూడు విడతలు సోదాలు నిర్వహించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సోదాల్లో లభ్యమైన సమాచారం ఆధారంగా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఎంత మంది డిపాజిట్ చేశారన్న వివరాలను వెల్లడించకుండా మార్గదర్శి గుట్టుగా వ్యవహరిస్తోందని అధికారులు చెబుతున్నారు. ప్రజల సొమ్మును ఇతర సంస్థలకు మళ్లించినట్లు పక్కా ఆధారాలు లభ్యమైన తరువాతే హైదరాబాద్‌లోని కార్యాలయంలో సోదాలు చేపట్టినట్లు అధికార వర్గాల సమాచారం.

# సంపాదకీయం

శుక్రవారం 16-12-2022

## చిన్నారులకు శాపంగా కేన్సర్

కేన్సర్' భూతం, ఇప్పుడు పేద ధనిక తేడా లేకుండా బాల్యాన్ని కూడా మింగేస్తోంది. లుకేమియా, మెదడు కేన్సర్, లింఫోమా, న్యూరోబ్లాస్టోమా, విల్మ్స్ ట్యూ మర్ వంటి కేన్సర్లు చిన్నారులను నులిపెడుతున్నాయి. బలహీన ఆరోగ్య వ్యవస్థ కలిగిన తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లోనే బాల్య కేన్సర్ల భారం అధికంగా ఉంది. మన దేశంలో మొత్తం కేన్సర్ కేసుల్లో 1.6 నుంచి 4.8 శాతం వరకు పదిహేనేళ్ల కంటే తక్కువ వయస్సు పిల్లల్లో కనిపిస్తోంది. పది శాతం కేసులు మాత్రమే జన్యుపరమైన కారణాల వల్ల సంభవిస్తున్నాయి.ఏడాదిలోపు పిల్లల్లో తలెత్తే కేన్సర్లలో 'న్యూరోబ్లాస్టోమా' ఒకటి. నాలుగేళ్లలోపు పిల్లల్లో లుకేమియా సాధారణంకాగా, 916 ఏళ్ల పిల్లల్లో బోన్ కేన్సర్లు అధికంగా ఉంటున్నాయి. ప్రతి ఏటా సుమారు 75 వేల మంది పిల్లలు కేన్సర్‌కు గురవుతున్నట్లు 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' తెలిపింది. గ్లోబల్ చైల్డ్ హుడ్ కేన్సర్ నిష్పత్తిలో కనీసం 20 శాతం కేసులు మన దేశంలోనే ఉన్నాయి. 514 ఏళ్ల పిల్లల్లో సుమారు 50 శాతం మరణాలకు కేన్సర్ సంబంధిత వ్యాధులు కారణమవుతున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. సరైన అవగాహన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ ద్వారా కేన్సర్ సమస్యని అధిగమించవచ్చని ఆరోగ్య నిపుణులు తెలియజేస్తున్నారుకేన్సర్ అనగానే ముందుగా పెద్దవాళ్లే గుర్తుకొస్తారు. కానీ, కేన్సర్ బాధితుల్లో ఐదు శాతం పిల్లలే ఉంటున్నారు. చెడు అలవాట్ల వంటి ముప్పు కారకాలేవీ లేకపోయినా పిల్లలు కేన్సర్ బారినపడటం దురదృష్టంగానే భావించాలి. పుట్టుకతోనే జన్యువుల పని తీరు అస్తవ్యస్తం కావటం దీనికి మూలం. అయితే సరైన సమయంలో గుర్తించగలిగితే పిల్లల్లో తలెత్తే కేన్సర్లనీ దాదాపుగా నయం చేయవచ్చు. పెద్దవారిలో 60 65 శాతం మందిలో కేన్సర్ తగ్గితే, పిల్లల్లో 85 90 శాతం మందిలో పూర్తిగా నయం చేయవచ్చు. ప్రాథమిక దశలో గుర్తించి సరైన చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. వ్యాధి ముదిరాక గుర్తించినా ఫలితం అంతగా ఉండదు.ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా కేన్సర్ బారినపడిన చిన్నారుల్లో సగం మంది వ్యాధి గుర్తించక, వైద్యం అందక మరణిస్తున్నారని ఓ అధ్యయనంలో వెల్లడయింది. ప్రతి ఏటా కొత్తగా రెండు లక్షల మంది చిన్నారులకు కేన్సర్ సోకుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. కేన్సర్ కేసులు ఎక్కువగా ఆఫ్రికా, దక్షిణ మధ్య ఆసియా, పసిఫిక్ ఐలాండ్స్‌లో నమోదవుతున్నా యి. 2015 నుంచి ప్రపంచంలోని చాలా దేశాల్లో లింఫోబ్లాస్టిక్ లుకేమియా వ్యాపిస్తోంది. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో కేన్సర్ బాధిత చిన్నారులకు అవసరమైన మందులు, ఆహారం అందుబాటులో ఉండటం లేదు. దీంతో కేన్సర్ సోకిన అత్యధిక మంది పిల్లలు ఐదేళ్ళకు మించి బతక్కపోవడానికి, కేన్సర్‌ను సకాలంలో గుర్తించకపోవడం, వైద్యం ఖర్చు భరించలేనంతగా ఉండడం, మధ్యలోనే చికిత్స ఆగిపోవడం వంటి కారణాలు చిన్నారుల పాలిట శాపంగా మారాయి. ఢిల్లీలోని ఎయిమ్స్‌ను, చెన్నైలోని అడయార్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లలో సేకరించిన డేటా ప్రకారం అబ్బాయిల్లోనే కేన్సర్ లక్షణాలు అధికంగా ఉంటున్నట్లు ఢిల్లీలోని 'పాపులేషన్ బేస్డ్ కేన్సర్ రిజిస్ట్రీ ఆఫ్ ఇండియా' తెలిపింది. అమ్మాయిల్లో కేన్సర్ బారిన పడినా బయటకు పొక్కనీవ్వకుండా ఉంచడం వల్ల అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉంటున్నట్లు భావిస్తున్నారు. కేన్సర్ సోకినప్పటికీ లింగ వివక్ష కారణంగా వారిని ఆసుపత్రి వరకు తీసికెళ్లి వైద్యులకు చూపించకపోవడమే ఇందుకు కారణమని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ పరీక్షల్లో వారికి కేన్సర్ అని తేలినా, చికిత్స చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. చికిత్స ఖర్చు పెరిగే కొద్దీ అమ్మాయిల విషయంలో వివక్ష చూపిస్తున్నారు. దక్షిణ భారతంతో పోలిస్తే ఉత్తరాదిన; మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్ బాధితులకు చికిత్స విషయంలో ఈ లింగ వివక్ష ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. కేన్సర్ పరీక్షల విషయంలోనే కాదు, ఎంతో మంది కేన్సర్ బాధితులు అత్యంత ఖరీదైన మూలకణ మార్పిడి చికిత్స చేయించుకుంటున్నారో అనే అంశాన్ని కూడా వైద్యులు పరిశీలించారు.ఈ విషయంలో కూడా లింగ వివక్ష ఉన్నట్లు స్పష్టమైంది. అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకే ఎక్కువగా చికిత్స చేయిస్తున్నట్లు అధ్యయనంలో వెల్లడయింది. ప్రజల్లో ఉన్న ఈ తరహా ఆలోచనాధోరణని మార్చాలని వైద్యులు తెలియజేస్తున్నారు. మన రాష్ట్రం విషయానికొస్తే సుమారు ఐదు వేల మంది చిన్నారులు ప్రతి ఏటా కేన్సర్‌కు గురవుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జన్యుపరంగానే ఎక్కువ మంది దీని బారినపడుతున్నట్లు తేలింది. పదేళ్ల వయస్సులోపు పిల్లల సంఖ్య అధికంగా ఉంటోంది.ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో మధ్య తరగతి, ఆ కింది స్థాయి వారి సంఖ్య అధికంగా ఉంటోంది. జన్యుపరంగా తల్లిదండ్రుల్లోని క్రొమోజోముల స్థాయిని బట్టి 10 లేదా 11 ఏళ్లకు కూడా కొందరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. స్క్రీనింగ్‌కు రాకపోతుండడంతో కేన్సర్‌కు గురైన వారి సంఖ్య గణనీయంగానే ఉంటున్నది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా, ప్రజల్లో చైతన్యం పెరిగినా నేటికీ చాలా మంది రోగ నిర్ధారణకు ముందుకు రావడం లేదు. యుక్త వయస్సుతో పాటు చిన్నారుల్లో వచ్చే కేన్సర్ ప్రమాదకరం కాగా, 50 శాతం జన్యు సంబంధంగా వస్తే, మరో 20 శాతం అలవాట్ల కారణంగా సంభవిస్తున్నాయి. నాలుగు తరాల కిందటి వారిలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్నా, ఆ తర్వాత పిల్లలకు కేన్సర్ సోకే ప్రమాదముంది. వీటిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. అప్పుడే త్వరగా చికిత్స అందిచడానికి సాధ్యమవుతుంది.కేన్సర్ బారిన పడిన చిన్నారుల్లో 3వ వంతు అసంపూర్ణ చికిత్స కారణంగా బతికే అవకాశాన్ని కోల్పోతున్నారు. దిగువ, మధ్యతరగతి ఆదాయం కలిగిన దేశాల్లో 30 శాతం మంది చికిత్సను మధ్యలోనే వదిలేస్తున్నారు. మరింత పేదరికంలో ఉన్న దేశాల్లో 99 శాతం మంది చికిత్స చేయించకపోవడం, లేదంటే చికిత్సను మధ్యలోనే నిలిపి వేయడం జరుగుతోంది. ఇక ప్రత్యామ్నాయ, సాంప్రదాయ చికిత్స విధానాన్ని అనుసరిస్తున్నవారు 31 శాతం ఉండగా, ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చికిత్సను మానుకుంటున్నవారు 28 శాతం ఉన్నారు. ఇక కేన్సర్‌కు చికిత్స లేదనీ, నయం కాని వ్యాధని భావిస్తున్న వారు 26 శాతం. ఏదేమైనా అందివచ్చిన ఆధునిక వైద్య చికిత్స ద్వారా కేన్సర్‌ను నయం చేయడానికి వైద్యులు కృషి చేస్తున్నారు.ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యే క వైద్యశాలలను ఏర్పాటు చేసి ఉచితంగా చికిత్సను అందిస్తున్నది. చికిత్సలో భాగంగా కీమోథెరపీ ప్రధానమైనది. ఒక్కోసారి సర్జరీ చేయాల్సి రావొచ్చు. రేడియేషన్ వల్ల దుష్ప్రభావాలు ఉండటానికి ఆస్కారముంది. పది, పదిహేను సంవత్సరాల తర్వాత ఈ దుష్ప్రభావాలు బయటపడే అవకాశముంటుంది.

# మైలవరంలో మారుతున్న రాజకీయం

విజయవాడ, డిసెంబర్ 15,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పెద్ద నియోజకవర్గాల్లో ఒకటైన మైలవరంలో ఇప్పుడు రాజకీయం రూటు మార్చుకోనుందా..? లోకల్ గా అక్కడ ఉండే నాయకుడు కావాలి అనే పబ్లిక్ డిమాండ్ తో జనసేన బలం పుంజుకొనుందా? అధికార ప్రతిపక్ష పార్టీల నడుమ జనసేన అభ్యర్థి గెలిచేనా? అక్కడ జనసేనకు ఉన్న బలం, బలహీనతలు ఏంటి?ఏపీ రాజకీయాల్లో చాలా రోజులుగా మైలవరం నియోజకవర్గం హాట్ టాపిక్‌గానే ఉంటోంది. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, మంత్రి జోగి రమేశ్‌లకు మధ్య ఇంటర్నల్‌గా అస్సలు పొసగడం లేదనే ముచ్చట జోరుగా వినిపిస్తోంది. పొలిటికల్‌గా ఇదో సంగతయితే? ఇప్పుడు లోకల్ నాన్ లోకల్ అనే వ్యవహారం అధికార వైసీపీతో పాటు? ప్రతిపక్షంలోని టీడీపీకి నష్టం కలిగించేలా మారింది. గత మూడు పర్యాయాల నుంచి మైలవరంలో నాన్ లోకల్సే గెలిచారు మరి. గతంలో టీడీపీ తరపున గెలిచి దేవినేని ఉమ.. 2019లో వైసీపీ అభ్యర్థిగా గెలిచిన వసంత కృష్ణ ప్రసాద్‌లిద్దరూ నందిగామ నుంచి వచ్చినవాళ్లే. ఇలా.. వేరే ప్రాంతంవాళ్లు తమపై పెత్తనం చేయడం.. స్థానికులకు అస్సలు నచ్చుట్లేదని తెలుస్తోంది.ఎలక్షన్ హీట్ పెరగడంతో, స్థానికత వివాదం వైసీపీ, టీడీపీల మధ్య చినికిచినికి గాలివానగా మారింది. ఇదే అస్త్రాన్ని తనకి అనుకూలంగా మార్చుకుంటున్నారట మైలవరంలో జనసేన అభ్యర్థి అక్కల రామ్మోహన్ రావు. అక్కల గాంధీగా లోకల్స్‌కి సుపరిచితుడైన రామ్మోహన్? ప్రత్యర్థులకు ధీటుగా అందరితో కలిసిపోయి పని చేసుకుంటున్నారట. స్థానికత్వం ఈయనకు అదనపు బలం అయ్యే అవకాశం లేకపోలేదు. 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 2019 వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన రామ్మోహన్‌రావు? గత ఎన్నికల్లో జననేత అభ్యర్థిగా పోటీచేసి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. అయితే, చాలా ప్రాంతాల్లో ఓట్లు చీలడంతోనే.. గెలుపోటములు తారుమారయ్యాయనే అభిప్రాయం కూడా ఉంది.రాబోయే ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ నుంచి మైలవరంలో.. పోటీచేయబోయే ఇద్దరు నేతలూ నాన్ లోకల్స్. ఇప్పుడు అదే అస్త్రాన్ని వాడనున్నారు అక్కల గాంధీ . నాన్ లోకల్స్ అంతా.. ఇసుక, గ్రావెల్,బూడిద అక్రమ మైనింగ్ చేస్తున్నారనీ.. కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో టీడీపీ,వైసీపీ నాయకులు నెగ్గినా జరిగిన అభివృద్ధి మాత్రం శూన్యమనీ? జనసేన తరపున ప్రచారం చేస్తూ ముందుకు వెళ్తున్నారు. అదెంతో కొంత పనిచేసే అవకాశం లేకపోలేదన్నది విశ్లేషకుల మాట.మైలవరం నియోజకర్గంలో 8 మండలాలు, ఒక మున్సిపాలిటీ ఉంది. 5 లక్షల జనభా ఉండగా.. దాదాపు 3 లక్షలమంది కమ్మ ,కాపులే ఉన్నారు. బీసీ, ఎస్సీలు 2 లక్షల వరకు ఉంటారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని చెప్తున్న జనసేన? టిడిపితో కలిసివెళ్తే మాత్రం సీటు ఎవరికి దక్కుతుందనేదే తేలాల్సి ఉంది. పొత్తులో టిడిపికి టికెట్ కేటాయిస్తే జనసేన కార్యకర్తలు సపోర్ట్ చేస్తారా? అన్నది ఫుల్లుగా డౌట్‌ఫుల్లే. పోనీ జనసేనకే టికెట్ ఇస్తే.. కమ్మవారికి కంచుకోటగా ఉన్న కొండపల్లి ఖిల్లా ప్రజలు.. ఆదరిస్తారా? అనేదీ అనుమానమే. ఇంతకీ, జనసేన రూటు ఎటు.. ఎన్నికలనాటికి ఎవరు ఎటువైపు నిలుస్తారన్నదే రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

# కడప బరిలో టీడీపీ మహిళ

కడప, డిసెంబర్ 15,వైసిపి కంచుకోటలో టిడిపి పాగా వేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుంది . ఏది ఏమైనా ఇక్కడ టిడిపి తన ప్రభావాన్ని చూపాలని తహ తహ లాడుతుంది . పార్టి ఆవిర్భావంలో తన సత్తా చూటిన టిడిపి కాలక్రమంలో కనుమరుగై పోయింది. అయితే ఈసారి ఇక్కడ మహిళకు సీటు కేచాయించి అనూహ్య విజయం సాధించాలని ప్లాన్లు వేస్తుంది టిడిపి .. ఈసారి ఇక్కడ మహిళకు సీటు ఇద్దామనే ఆలోచన చేస్తున్నారనే సమాచారం బయటికి పొక్కడంతో నేతలు వారి జీవిత భాగస్వాములకోసం ప్రయత్నాలు మదలుపెట్టేశారు .ఆవిర్భావం తర్వాత కడప అసెంబ్లీ నియోజకవర్గంలో మూడుసార్లు గెలిచింది టీడీపీ. 1999 ఎన్నికలే ఇక్కడ టీడీపీకి ఆఖరు గెలుపు. ఆ తర్వాత రెండు సార్లు కాంగ్రెస్.. రెండుసార్లు వైసీపీ? ఇక్కడ విజయం సాధించాయి. అయితే ఈసారి ఎలాగైనా కడపసీటును గెలిచితీరాలన్న కసితో కనిపిస్తోంది సైకిల్ పార్టీ. వర్గపోరు కారణంగా క్యాడర్‌లో చీలికలు రావడంతో పార్టీ కొంత చతికిలబడినా? ఈసారి ముందస్తు ప్రణాళికలతో దూసుకెళ్లాలని భావిస్తోంది. ఇన్నాళ్లూ ప్రధాన పార్టీలన్నీ? కడప అసెంబ్లీ అనగానే.. అయితే రెడ్డి, లేదంటే మైనార్టీ.. అన్నట్టుగా సీట్లు కేటాయించాయి. గత రెండు ఎన్నికల్లో వైసీపీ అయినా, అంతకు ముందు కాంగ్రెస్ అయినా.. మైనార్టీలకు సీటు కేటాయించి విజయం సాధించాయి.ఈ సారి కూడా ఆ పార్టీలు.. అదే సంప్రదాయాన్ని కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఈసారి గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న టీడీపీ.. కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.కడపలో పోటీకి.. టీడీపీ హైకమాండ్ ఈసారి వినూత్న ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. కడపగడపలో మహిళకు సీటు కేటాయించి? ప్రధాన పార్టీలకు గట్టీ పోటీ ఇవ్వాలని భావిస్తోంది. వైసిపి వ్యతిరేక ఓటుని చీల్చి.. కడప సీటును తన ఖాతాలో వేసుకోవాలని గట్టి ప్రణాళికతో ముందుకు రాబోతోందట. ఇది, జనరల్ సీటు కావడంతో? ఇప్పటి వరకూ పురుషులకే అవకాశం దక్కింది. దీంతో, ఈసారి కాస్త డిఫరెంటు వేలో వెళ్లాలనుకుంటున్న టిడిపి .. లేడీస్‌ను రంగంలోకి దింపి సత్తా చాటాలనుకుంటోంది. దానికోసం బలమైన అభ్యర్థిని వెతికే పనిలో నిమగ్నమైందట హైకమాండ్. దీనికోసం భారీ కసరత్తులే చేస్తోందిటపార్టీలో ప్రధాన భూమిక పోషిస్తున్న రెండు కుటుంబాల నుంచే ఆ మహిళా అభ్యర్థి ఎంపిక ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. టిడిపి పోలిట్ బ్యూరో మెంబర్ శ్రీనివాస రెడ్డి , కడప టిడిపి నేత అలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబాల నుంచి.. ఎవరో ఒకరిని బరిలో దింపే ఆలోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, మహిళా అభ్యర్థికి అనుకున్నస్థాయిలో ఓట్లు వస్తాయా? రావా? అనే విషయంలో సర్వేలు కూడా చేయించినట్టు సమాచారంకడప మున్సిపాలిటీలో ప్రస్తుతం టీడీపీకి ఒకేఒక్క కార్పొరేటర్ ఉన్నారు. ఆవిడే అలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి కోడలు ఉమాదేవి. అంతా ఓడినా ఆమె మాత్రం టీడీపీ జెండా ఎగరేశారు. కాబట్టి? ఈసారి కడప అసెంబ్లీ బరిలో టీడీపీ తరపున మహిళకు సీటు కేటాయిస్తే.. అది ఆమెకే ఇస్తారన్న ప్రచారం జోరందుకుంది. మరొకరికి అవకాశం ఇవ్వాల్సి వస్తే? అధికారం ఉన్నా, లేకున్నా పార్టీ కోసం నిలబడిన శ్రీనివాస రెడ్డి కుటుంబానికే దక్కుతుంది. ఆ లెక్కన ఆయన భార్య.. రేసులో ఫస్టుంటారన్నది నిర్వివాదాంశం. పురుషులైనా, మహిళలైనా..గెలుపు గుర్రాలకే టిక్కెట్లని చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారు కాబట్టి? పార్టీ సర్వేల ఆధారంగానే కడపకోటలో ఎవరు పోటీచేస్తారనేది తేలనుంది. చంద్రబాబు కడప పర్యటన తర్వాత? ఈ విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# జనసేన గూటికి కన్నా




గుంటూరు, డిసెంబర్ 15,బీజేపీ ఏపీ మాజీ అధ్యక్షుడు..మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కేంద్రంగా ఆసక్తి కర రాజకీయం చోటు చేసుకుంటోంది. కన్నా ఇంటికి జనసేన కీలక నేత మనోహర్ రావటం ఉత్కంఠను పెంచుతోంది. బీజేపీ – జనసేన మిత్రపక్షాలుగా ఉన్నాయి. ఇది సాధారణ సమావేశమే అని చెబుతున్నా..దీని వెనుక ఉన్న రాజకీయం మాత్రం ఆసక్తిగా కనిపిస్తోంది. బీజేపీ ఏపీ చీఫ్ సోము వీర్రాజు పైన కొద్ది రోజుల క్రితం కన్నా కీలక వ్యాఖ్యలు చేసారు. ఈ భేటీ ద్వారా కన్నా కు జనసేనలోకి రూటు క్లియర్ అయిందని విశ్వసనీయ సమాచారం. అయితే, బీజేపీ నేతలనే జనసేన తమ పార్టీలోకి తీసుకోవటం అధికారమైతే..పొత్తు మీద ప్రభావం చూపటంతో పాటుగా.. ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీయం ఖాయంగా కనిపిస్తోంది.కన్నా లక్ష్మీనారాయణ ప్రస్తుతం బీజేపీలో ఉన్నార. కానీ, పార్టీ రాష్ట్ర నాయకత్వం పట్ల అసహనంగా ఉన్నార. జనసేనతో పొత్తు కొనసాగిస్తున్నా.. పవన్ ఒక దశలో చంద్రబాబుకు దగ్గరవుతున్నారనే సంకేతాలు కనిపించాయి. ఆ సమయంలో కన్నా ఆవేదన వ్యక్తం చేసారు. సోము వీర్రాజు తీరు కారణంగానే పవన్ దూరం అవుతున్నారనే అభిప్రాయం కన్నా వ్యక్తం చేసారు. ఆ దశలో ఆయన జనసేన వైపు ఆసక్తిగా ఉన్నారనే వాదన వినిపించింది. కానీ, బీజేపీ కీలక నేతల జోక్యంతో కన్నా సైలెంట్ అయ్యారు. అటు వీర్రాజు కూడా కన్నా వ్యాఖ్యల పైన స్పందించ లేదు. విశాఖ కేంద్రంగా ప్రధానితో జనసేన అధినేత పవన్ సమావేశం తరువాత టీడీపీ –జనసేన మధ్య పొత్తు ఉండదని, బీజేపీతో పవన్ ఉంటారనే చర్చ మొదలైంది. కానీ, నెల గడుస్తున్నా..ఇప్పటి వరకు రెండు పార్టీల మధ్య ఒక్క సమావేశం కూడా జరగలేదు. ఇదే సమయంలో జనసేన సొంతంగా తమ బలం పెంచుకొనే ప్రయత్నాలను ముమ్మరం చేసింది.కన్నా లక్ష్మీనారాయన బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే జనసేనతో పొత్తు ఖరారైంది. జనసేనతో పొత్తు కొనసాగాలనేది కన్నా లక్ష్యం. అయితే, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరాణల నేపథ్యం లో కన్నా పార్టీ ఆలోచన మారిందని..జనసేన వైపు చూస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఇప్పుడు నాదెండ్ల మనోహర్ స్వయంగా కన్నా ఇంటికి రావటం..ఇద్దరూ సమావేశం కావటం ద్వారా జనసేనలోకి కన్నాను ఆహ్వానించేందుకు మనోహర్ వచ్చారనే చర్చ సాగుతోంది. అయితే, బీజేపీ తో మిత్రపక్షంగా ఉన్న సమయంలో కమలం పార్టీ నేతలను జనసేనలోకి ఆహ్వానిస్తే మైత్రి మీద ప్రభావం పడుతుందనే వాదన ఉంది. అయినా..ఇప్పుడు మనోహర్ – కన్నా తో భేటీ సాధరణమనే చెబుతున్నా..భవిష్యత్ నిర్ణయాల కోసమేనని విశ్వసనీయ సమాచారం. ఇప్పటి వరకు బీజేపీలోని ఏ నేత ఇంటికి జనసేన నేతలు వెళ్లలేదు. ఇప్పుడు కన్నా తో నాదెండ్ల భేటీ వెనుక పార్టీ మార్పు అంశమే ప్రధానమని ప్రచారం సాగుతోందిఇప్పుడు కన్నాతో నాదెండ్ల భేటీ తో కొత్త సమీకరణాలు తెర మీదకు వస్తున్నాయి. కన్నా కాంగ్రెస్ లో మంత్రిగా ఉన్న సమయంలో..మనోహర్ స్పీకర్ గా ఉన్నారు. ఇద్దరూ ఒకే జిల్లా రాజకీయ నేతలు. బీజేపీ – జనసేన పొత్తు సమయంలో ఇద్దరూ సన్నిహితంగా ఉండేవారు. ఇక, ఇప్పుడు కన్నా బీజేపీ నుంచి జనసేనలోకి చేరితే రాజకీయంగా ఏపీలో కొత్త సమీకరణాలకు నాంది కానుంది. దీని కారణంగానే మర్యాద పూర్వక భేటీగానే పైకి చెబుతున్నట్లుగా కనిపిస్తోంది. బీజేపీ నుంచి జనసేన చేరికలను ప్రోత్సహిస్తుందనే అభిప్రాయం ఏర్పడుతుంది. దీంతో ఇప్పుడు కన్నాతో మనోహర్ భేటీ లో ఏం జరుగుతోంది.

# పీకే ఫోటోపై సోషల్ మీడియాలో వైరల్

విజయవాడ, డిసెంబర్ 15, పవన్ కల్యాణ్ ఫోటో పక్కన తన ఫోటో ఉండటం తనకు ఎంతో థ్రిల్ కలిగించిందని మంచు లక్ష్మి పెట్టిన ఓ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నిజానికి మంచు లక్ష్మి పవన్ కల్యాణ్‌పై ఎంతో గౌరవంతోనే ఆ పోస్ట్ పెట్టారు. కానీ ఆమె షేర్ చేసిన కంటెంట్ మాత్రం పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌ను ఇబ్బంది పెట్టేలా ఉంది. దాంతో మంచు లక్ష్మిపై పవన్ ఫ్యాన్స్ ఫైరవుతున్నారు. పవన్ కల్యాణ్ ఇటీవల మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేస్తున్నారని.. ఇరవై ఏళ్ల తర్వాత అలాంటి అవసరం వచ్చిందని చెబుతూ ఓ ఫోటో తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్‌సీపీ నాయకులు రకరకాలుగా సెటైర్లు వేస్తున్నారు. వారిపై జనసేన నాయకులు విరుచుకుపడుతున్నారు. ఇలా ఓ వైఎస్ఆర్‌సీపీ సానుభూతిపరుడు.. గతంలో మంచు లక్ష్మి ఇచ్చిన అలాంటి స్టిల్ ఫోటోను వెలికి తీసి.. పవన్ కల్యాణ్ పక్కన పెట్టి.. పవన్ కల్యాణ్ మంచు లక్ష్మిని కాపీ కొట్టారని మీమ్ తయారు చేశారు. దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ పవన్ కల్యాణ్ ను కించపరిచేలా ఉంది. అయినప్పటికీ మంచు లక్ష్మి పెద్దగా పట్టించుకోకుండా.. పవన్ కల్యాణ్ పక్కన ఫోటో ఉంచి మీమ్ తయారు చేయడం థ్రిల్లింగ్ ఉందంటూ.. ఆ ట్వీట్‌ను షేర్ చేసుకుంటూ కామెంట్ చేశారు. మంచు లక్ష్మి తీరు సహజంగానే పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ను ఆగ్రహానికి గురి చేసింది. వారు తమదైన శైలిలో విమర్శలు గుప్పిస్తూ కామెంట్లు పెడుతున్నారు.ఇటీవలి కాలంలో మంచు లక్ష్మి సోషల్ మీడియాలో ఇలాంటి ట్రోలింగ్ పోస్టులను ఎక్కువగా షేర్ చేస్తున్నారు. ఎవరమన్నా పట్టించుకోవడం లేదు. కొద్ది రోజుల కిందట సీఎం జగన్ ను ట్రోల్ చేస్తూ పెట్టిన పోస్ట్ చేసి.. లోల్ అంటూ వెటకారం చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ వంతు.

# కొత్త మెడికల్ కాలేజీలకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ, డిసెంబర్ 15, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత (సీఎస్ఎస్) కింద ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంలో నూతన వైద్య కళాశాలలు ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి భారతీ పవార్ తెలిపారు. ఈ మూడు కాలేజీల్లో 150 ఎంబీబీఎస్ సీట్లు పెంచేందుకు అనుమతించినట్లు తెలిపారు. అలాగే రెండవ దశలో రాష్ట్రంలోని 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను బలోపేతం చేస్తూ కొత్త పీజీ కోర్సులు ప్రారంభించేందుకు 1040 పీజీ సీట్లు పెంచేందుకు అనుమతించినట్లు పేర్కొన్నారు. ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. దేశవ్యాప్తంగా సీఎస్ఎస్ కింద మూడో దశల్లో దేశవ్యాప్తంగా 157 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. జాతీయ మెడికల్ కమిషన్ అందించిన సమాచారం ప్రకారం ఏపీలో 13 ప్రభుత్వ వైద్య కళాశాలలతో సహా 32 మెడికల్ కాలేజీలు ఉన్నాయని, ఇప్పటికే సీఎస్ఎస్ కింద మంజూరు చేసిన 157 మెడికల్ కాలేజీల లిస్టులో లేని కొత్త మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని ఏపీ ప్రభుత్వం కోరినట్టు మంత్రి తెలిపారు. రూరల్ ప్రాంతాలకు వైద్య సేవలను విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలు లేని ప్రాంతాల్లో జిల్లా ఆసుపత్రులు, రిఫరల్ ఆసుపత్రులకు అనుసంధానంగా వైద్య కళాశాలలు నెలకొల్పుతున్నట్లు మంత్రి తెలిపారు.ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఏ కేటగిరీలో సీట్లు పొందిన పోస్టు గ్రాడ్యుయేట్ మెడికోలు వైద్య విద్య పూర్తి చేసిన అనంతరం ఏడాది పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్బంధంగా వైద్య సేవలు అందించాలనే నిబంధన 2022-23 విద్యా సంవత్సరం నుంచి వర్తించే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాజ్యసభలో విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర వైద్య శాఖ సహాయ మంత్రి శ్రీమతి భారతీ పవార్ రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. అలాగే సబ్ సెంటర్ స్థాయిలో కూడా వైద్యాధికారులు సేవలందించే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ట్రయల్ రన్ కూడా ప్రారంభించిందని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులను నియమించుకునేందుకు సరళమైన నిబంధనలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టింగ్ ఇన్, కాంట్రాక్టింగ్ అవుట్ పద్ధతిలో స్పెషలిస్ట్ సర్వీసులు, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి స్పెషలిస్టు డాక్టర్లను ప్రభుత్వ సేవలకు వినియోగించుకోవడం వంటి వాటిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.జాతీయ ఆరోగ్య మిషన్ కింద వైద్యులకు ఏరియా అలవెన్సులు, పెర్ఫార్మెన్స్ ఇన్సెంటివ్స్, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు వసతి, రవాణా ఖర్చులు వంటి వాటిని ఆయా రాష్ట్రాలు నిర్ణయించుకునే విధంగా వీలు కల్పించినట్లు కేంద్రమంత్రి తెలిపారు. డాక్టర్లు, స్పెషలిస్టులను ఆకర్షించే విధంగా జీతభత్యాలు నిర్ణయించుకునే అధికారం కూడా రాష్ట్రాలకు ఇచ్చినట్లు వెల్లడించారు. అందులో భాగంగానే యువర్ కోట్, యువర్ పే విధానం ప్రవేశపెట్టినట్లు మంత్రి తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం డిస్ట్రిక్స్ రెసిడెన్సీ ప్రోగ్రాంను ఆమోదించిందని, ఇందులో భాగంగా పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జిల్లా ఆసుపత్రుల్లో సేవలందించేందుకు మూడు నెలల పాటు నియమిస్తారని వివరించారు.

# టీడీపీ నిర్వీర్యమే అజెండా....

ఏలూరు, డిసెంబర్ 15, ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి భారతీయ జనతాపార్టీ ఢిల్లీ పెద్దల ప్రణాళిక వేరుగా ఉంది. ఏపీ, తెలంగాణ రెండూ కవల రాష్ట్రాలే అయినప్పటికీ భిన్నమైన రాజకీయ పోకడలు పోతుంటాయి. ఓటరుగా తీర్పునివ్వడంలో ఏపీ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు మధ్య భిన్న వైరుధ్యం ఉంది. ఏపీ ప్రజలు కులాలకు ప్రాధాన్యమిస్తుండగా, తెలంగాణ ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారు. రెండు రాష్ట్రాల ప్రజలూ విద్యావంతులే. కానీ ఏపీలో కులాలకే ప్రాధాన్యమెక్కువ. రెండు రాష్ట్రాల్లో పాగా వేయాలని.. రెండు రాష్ట్రాల్లోను పాగా వేయాలనేది భారతీయ జనతాపార్టీ పెద్దలు యోచన. మొదటి నుంచి ఆ పార్టీ ఏ రాష్ట్రంలోనైనా వారు ఒకటే సూత్రాన్ని అమలు చేస్తోంది. ఒకవైపు అధికార పక్షాన్ని టార్గెట్ చేస్తూనే మరోవైపు ప్రతిపక్షంపై గురిపెడతారు. కేంద్రంలో అధికారంలో ఉండటంవల్ల కలిగే లాభాలన్నింటినీ క్రోడీకరించుకొని, వాటిని ఉపయోగించుకొని విపక్షాన్ని వివిధ రీతుల్లో నిర్వీర్యం చేస్తారు. బలమైన నేతలుంటేనే పార్టీ విస్తరించగలుగుతుందనే సిద్ధాంతాన్ని నమ్మే భారతీయ జనతాపార్టీ పెద్దలు విపక్షంలోని బలమైన నేతలను బీజేపీలోకి చేర్చుకుంటారు. ఇక్కడితో ఆ పార్టీ ప్రణాళికలో మొదటి అంకం పూర్తయినట్లు లెక్క. ముందుగా విపక్ష స్థానంలోకి చేరుకోవడం విపక్షం నుంచి ఆ రాష్ట్రంలో అధికార పక్షానికి చేరుకోవాలంటే కేంద్రంలో అధికారంలో ఉండటం ద్వారా ఉండే అనుకూలతలను ఉపయోగించుకుంటుంది. ఇందులో వారికి తన, మన అనే భేదం అసలు ఉండదు. పాటించరు కూడా. ఆసేతు హిమాచలం కమలం జెండాను రెపరెపలాడించాలన్నదే వారి లక్ష్యం. అవసరమైతే అద్వానీ లాంటి నేతలను కూడా ఇంట్లో కూర్చోపెట్టగలరు. ఇలా ఆ పార్టీ మూడోస్థానం నుంచి రెండో స్థానానికి, అక్కడి నుంచి మొదటి స్థానానికి దశలవారీగా చేరుకుంటుంది. ఏపీలో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉందనే విషయం తెలిసిందే. టీడీపీని బలహీనపరిచి ఆ పార్టీలోని నేతలను తమ పార్టీలోకి తీసుకోవడంద్వారా ముందుగా విపక్షస్థాయికి చేరుకోవాలనే బీజేపీ ప్రణాళిక.అన్నిటికీ రాజకీయమే కారణం పవన్ కల్యాణ్ మిత్రపక్షంగా ఉన్నప్పటికీ బీజేపీ నాయకులు వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. కరోనావల్ల తమ మధ్య భౌతిక దూరం పెరిగిందని జనసేనాని స్వయంగా చెప్పారు. పవన్ ను ఖాతరుచేయని బీజేపీ అకస్మాత్తుగా మోడీతో భేటీ అయ్యేలా చూడటం కూడా రాజకీయ కోణమే ఇమిడివుందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. టీడీపీ–జనసేన కలిసి పోటీచేస్తే వైసీపీకి మైనస్ అవుతుంది.. అలాకాకుండా విడివిడిగా పోటీచేస్తే వైసీపీకి ప్లస్ అవుతుంది కాబట్టి టీడీపీని నిర్వీర్యంచేసి ఆ స్థానంలోకి రావాలనుకుంటున్న బీజేపీకి జనసేన వెళ్లి టీడీపీతో కలవడం ఇష్టంలేదు. అలా అని వైసీపీ మీద ప్రేమ ఉండదు. వారికి రాజకీయ అవసరాలే ముఖ్యం. పరిణామాలకు అనుగుణంగా వ్యూహం మార్చుకుంటున్నానని ప్రకటించిన జనసేనాని వెళ్లి చంద్రబాబుతో కలిస్తే టీడీపీ బలహీనపడదు. అందుకే పవన్ కల్యాణ్ ను టీడీపీకి దూరంగా ఉంచే ప్రయత్నమే చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు గత ఎన్నికల్లో తనవల్ల చీలిందని బహిరంగంగానే ఒప్పుకునే పవన్ ఈసారి అటువంటి పరిస్థితి రానివ్వనని స్పష్టంగా చెబుతున్నారు.

# బీఆర్ఎస్ ఫస్ట్ టార్గెట్.. అదేనా

కాకినాడ, డిసెంబర్ 15, ఏపీలో కేసీఆర్ పార్టీ బీఆర్ఎస్ ఎంట్రీ ఫిక్స్ అయిపోయింది. దాంతో పాటే దాని లక్ష్యం కూడా ఫిక్స్ అయినట్లే కనిపిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో అనుసరిస్తున్న ఈ వ్యూహాన్ని త్వరలో ఏపీలోనూ అమలు చేసే దిశగా కేసీఆర్ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.తద్వారా ఓవైపు బీజేపీకి, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న వర్గాల్నీ బుజ్జగిస్తున్న ప్రాంతీయ పార్టీలకు చెక్ పెట్టేందుకు వీలవుతుందనేది గులాబీ బాస్ వ్యూహంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ఎంట్రీతో.. ఏపీలో బీఆర్ఎస్ ఎంట్రీ రాష్ట్ర రాజకీయాల్ని మార్చబోతోంది. ఇప్పటివరకూ రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా కనిపిస్తున్న రాజకీయ పార్టీల పునాదుల్ని కదిలించేలా, మరికొన్ని పార్టీల ఓటు బ్యాంకుల్ని చెల్లాచెదురు చేసేలా కనిపిస్తోంది. దీంతో బీఆర్ఎస్ రాకపై ఇప్పుడు అధికార వైసీపీతో పాటు విపక్షంలోని టీడీపీ, జనసేన,బీజేపీ కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ముఖ్యంగా కేసీఆర్ జాతీయ విధానం ప్రకటన తర్వాత రాష్ట్రంలో రాజకీయం డిసైడ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతోపాటు బీఆర్ఎస్ తో పొత్తుల వ్యూహాలపైనా రాజకీయ పార్టీలు చర్చించుకుంటున్నాయి.ఇప్పటికే ఏపీలో అధికార వైసీపీతో పాటు విపక్షంలోని టీడీపీ, జనసేన అంటకాగుతున్నాయి, లేదా అంటకాగేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రం మద్దతు లేకుండా రాష్ట్రంలో రాజకీయాలు చేయలేమనే అంచనాకు వచ్చేయడమే. ఇప్పుడు ఈ భావనకు చెక్ పెట్టేలా బీఆర్ఎస్ ఎంట్రీ ఉండబోతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బీజేపీకి మద్దతిస్తున్న పార్టీల గుండెల్లో గుబులు రేపేలా, ముఖ్యంగా డబుల్ గేమ్ ఆడుతున్న పార్టీల రాజకీయానికి చెక్ పెట్టేలా బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం.ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో తప్పనిసరి బంధాన్ని కొనసాగిస్తోంది. రాష్ట్ర అవసరాల కోసమే ఈ బంధం కొనసాగిస్తున్నట్లు వైసీపీ చెప్పుకుంటున్నా.. జగన్ కేసుల నుంచి ఊరట కోసమే ఈ బంధం కొనసాగిస్తున్నట్లు విపక్షాలు చెవులు కొరుక్కుంటున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ రాకతో వైసీపీ-బీజేపీ బంధంపై ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా బీజేపీని బీఆర్ఎస్ టార్గెట్ చేసే క్రమంలో వైసీపీ కూడా టార్గెట్ కావడం ఖాయమనే అంచనాలున్నాయి. దీంతో బీఆర్ఎస్ తో ఎలా వ్యవహరించారనే

దానిపై వైసీపీ కూడా మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. జగన్ కు ముస్లింల్ని దూరం చేసేలా ? ఏపీలో బీఆర్ఎస్ ఎంట్రీ తర్వాత వైసీపీ-బీజేపీ ఇద్దరినీ టార్గెట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం కావడం ఖాయం. అందులో భాగంగా బీజేపీని నేరుగా టార్గెట్ చేయబోతున్న కేసీఆర్.. అనంతరం ఆ పార్టీకి వ్యతిరేకులుగా ఉన్న ముస్లింలను ఏకం చేసి తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు మొదలుపెట్టడం కూడా ఖాయం. వీరంతా ఇప్పుడు జగన్ కు మద్దతుగా ఉన్నారు. వీరిని తమవైపు తిప్పుకునేందుకు కేసీఆర్.. అవసరమైతే ఓవైసీ సాయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తద్వారా జగన్ కు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న కీలక వర్గాన్ని బీజేపీ బూచి చూపించి వైసీపీకి దూరం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నించవచ్చని తెలుస్తోంది. ఇప్పటివరకూ చంద్రబాబు కూడా ఈ వ్యూహం అమలు చేయలేకపోయారు. దీనికి కారణం ఆయన కూడా బీజేపీవైపు పలుసార్లు మొగ్గడం,ఇప్పుడు మరోసారి ఆ పార్టీతో పొత్తు కోసం ప్రయత్నిస్తుండమే.

# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలి

**చెప్పిన మాట సిఎం జగన్ నిలబెట్టుకోవాలి**

**సిఐటియు డిమాండ్**



కడప యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) అనుబంధం) జిల్లా 2 వ మహా సభలు కడప లోని సీఐటీయూ ఆఫీసు నందు డి రమేష్ అధ్యక్షతన జరిగిందిసిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్టం లో ఉన్న 25,000 మంది విద్యుత్ కార్మికులను సంస్థలో విలీనం చేసుకొని,రెగ్యులర్ చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకొని మా కుటుంబాల్లో వెలుగులు నింపాలని, 6,000 మంది పీస్ రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని, కేంద్ర ప్రభుత్వం 2021 విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థను రాష్ట్ర ప్రభుత్వ అదీనంలోనే కొనసాగించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే డిశనీబర్ 28న రాష్ట్ర మహాసభలు గుంటూరు లో జరగును.ఈ మహాసభలను జయప్రదం చేయడానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈసమావేశంలోయునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా,అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసులు, ఎస్ పిడిసిఎల్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, డిస్కమ్ ప్రధాన కార్యదర్శి బి సుమన్ డిస్కం సహాయ కార్యదర్శి కే సురేష్ బాబు,మైదుకూరు డివిజన్ అధ్యక్షుడు బి సుజన్ కార్యదర్శి పీసీ కొండయ్య, హరి ,బద్వేల్ సబ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రఫీ శేషయ్య జిల్లా ఉపాధ్యక్షులు హరి,కొండారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు హుస్సేన్,కుమార్ ట్రాన్స్కో నాయకులు మధుసూదన నాయుడు, సాయిసుబ్బరాయు డు,గంగాధర్,వాచ్మాన్ నాయకులు రవిచంద్రారెడ్డి,నబి, క్రిష్ణారెడ్డి విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు

# పెద్ద దర్గాలో రజనీకాంత్, ఏఆర్ రెహ్మాన్

కడప కడప అమీన్ పీర్ దర్గాను సూపర్ స్టార్ రజనీకాంత్, సంగీత మాంత్రికుడు ఏ.ఆర్ రెహ్మాన్, రజనీకాంత్ కూతురు ఐశ్వర్య రజనీకాంత్ గురువారం దర్శించుకున్నారు. దర్గాకు వచ్చిన చ్చేసిన సూపర్ స్టార్ రజనీకాంత్, సంగీత మాంత్రికుడు ఏ.ఆర్ రెహ్మాన్ కు దర్గా పీఠాధిపతి దర్గా సంప్రదాయ ప్రకారం ఘనంగా స్వాగతం పలికి, తలకు పాగా చుట్టారు. తరువాత వారిద్దరూ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గా విశిష్ఠతను అడిగి తెలుసుకున్నారు.

# ఇంద్రకీలాద్రి పై ఘనంగా భవాని దీక్షల విరమణ

విజయవాడ ఇంద్రకీలాద్రిపైన భవనా దీక్షల విరమణలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు, ఈఓ భ్రమరాంభ, ఆలయ అర్చకులు, స్థానాచార్యులు హోమగుండాలకు ఆజ్యం సమర్పించారురర. అగ్ని ప్రతిష్ఠాపన చేసి 3 హోమగుండాలను వెలిగించి భవానీ దీక్ష విరమణలు ప్రారంభం చేసారు. ఇవాళ నుంచీ ఐదు రోజుల పాటు భవానీ దీక్షా విరమణలు జరగనున్నాయి. కరోనా తరువాత జరుగుతున్న దీక్షలు కావడంతో 7లక్షల పైగా అమ్మవారి దర్శనార్థం భవానీలు రావొచ్చని అంచనా వేస్తున్నారు. భవానిల కోసం తాత్కాలిక షెడ్లు, కేస ఖండన శాలలు ఎర్పాటు చేసారు. వినాయకుని గుడి నుంచి అమ్మవారి సన్నిధి వరకు నాలుగు క్యూ లైన్లు ఏర్పాటు చేసారు. ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షణ కు అనుమతినిచ్చారు. దీక్షా విరమణలకు వచ్చే భవానీలకు పటిష్ట ఏర్పాట్లు చేసారు. 10 కౌంటర్ల ద్వారా ప్రసాదాలు ...20లక్షల లడ్డూలు దుర్గగుడి అధికారులు సిద్ధం చేసారు. సీతమ్మ పాదాలు, భవాని ఘాట్, పున్నమి ఘాట్ జల్లు స్నానాలు ఎర్పాటు చేసారు.

# తీరని నష్టాన్ని మిగిల్చిన మాండూస్

విజయవాడ, డిసెంబర్ 15, మాండూస్ తుపాను దెబ్బకు రైతు వెన్ను విరిగింది. వరి, పత్తి, మిర్చి తదితర పంటలకు అపార నష్టం వాటిల్లింది. చేతికి వచ్చిన పంట పాడైపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పంట నష్టాల అంచనాల్లో అధికార యంత్రాంగం ఉంది. బాపట్ల జిల్లా కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని రేపల్లె, బాపట్ల వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో వర్షాలకు ముందు కోసి అరబెట్టిన 30 వేల ఎకరాల్లోపైగా వరి కంకులు నీట మునిగాయి. మాగాణి భూముల్లో కోసిన వరి ఓదెలు నీటిపై తేలియాడుతున్నాయి. మరో 40 వేల ఎకరాల్లో వరి వరి పైరు గాలులకు ఒరిగిపోయింది. పత్తి, మినుము, మిర్చి, పసుపు, ఉద్యాన పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రకాశం జిల్లాలో సాగర్ ఆయకట్టులో కోసిన వరి ఓదెలు తడిచి ముద్దయ్యాయి. త్రిపురాంతకం, దర్శి, తాళ్లూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. వరి ధాన్యం తడిచిపోవడంతో రంగు మారే ప్రమాదం ఉంది. పశ్చిమ ప్రాంతంలో మిర్చి పంట దెబ్బతినిపోయింది. దోర్నాల, పెద్దారవీడు ప్రాంతాల్లో మిర్చి తోటల్లో నీరు చేరి కాయలు రాలిపోయాయి.మినుము, బొబ్బర్లు, పొగాకు పంటకూ నష్టం వాటిల్లింది. కడప జిల్లాలోని 35 మండలాల్లో, అన్నమయ్య జిల్లాలోని ఏడు మండలాల్లో మొత్తం 9,001 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కడప జిల్లాలో పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, బి.మఠం, కాశినాయన, బద్వేల్, గోపవరం, అట్లూరు, సిద్ధవటం, ప్రొద్దుటూరు, పెద్దముడియం, మైదుకూరు, చాపాడు, వి.ఎన్‌పల్లి, వల్లూరు మండలాల్లోని సుమారు 30 రకాల పంటలపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. 4,387 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 2,062 ఎకరాల్లో బుడ్డశనగ, 1,042 ఎకరాల్లో వరి, 1,235 ఎకరాల్లో జొన్న పంటలు నేలకొరిగాయి.141.5 ఎకరాల్లో పండ్ల తోటలపై ప్రభావం చూపించింది. అరటి, ఉల్లి, టమోటో పంటలకు నష్టం వాటిల్లింది. అన్నమయ్య జిల్లాలో మదనపల్లి, పీలేరు, రాజంపేట, లక్కిరెడ్డిపల్లి, మదనపల్లి, నిమ్మనపల్లి, కొరబాలకుంట, బి.కొత్తకోట, పెనగలూరు, రామాపురం మండలాల్లో వరి దెబ్బతింది. తుపాను తాకిడి ఎక్కువగా ఉన్న తిరుపతి జిల్లాలో వందలాది కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. వీరిని పునరావాస కేంద్రాలకు తరలించారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను ఆదుకొనేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు ముందుకువచ్చాయి. జిల్లా 76 ఇళ్లు దెబ్బతిన్నాయి. 600 ఎకరాల్లోపైగా వరి పంట నీట మునిగింది. వాగులు, నదుల ఉధృతితో దాదాపు 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మల్లిమడుగు, కల్యాణి డ్యాముల నుంచి నీటిని దిగువకు వదిలారు. సముద్రతీర ప్రాంతాలైన గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.తిరుమల శ్రీవారి క్షేత్రంలో మంచు దుప్పటి కమ్మేసింది. చలి తీవ్రత అధికంగా పెరగడంతో శ్రీవారి సందర్శకులు వణికిపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చంటి పిల్లలతో వచ్చిన సందర్శకులు గదుల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.నెల్లూరు జిల్లాలో వరి నారు మళ్లు, నార్లు దెబ్బతిన్నాయి. సంగం బ్యారేజీకి, సోమశిలకు వరద నీరు వచ్చింది. సోమశిల రెండు గేట్లు ఎత్తి 19.610 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఉదయగిరి, వరికుంటపాడు, కందుకూరు ప్రాంతాల్లో కందులు, పొగాకు, మినుము పంటలు దెబ్బతిన్నాయి. కందుకూరు సబ్ డివిజన్ పరిధిలో సుమారు 2,460 ఎకరాల్లో శనగ పైరుకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. 33 శాతం కన్నా ఎక్కువ నష్టపోయిన రైతులకు సబ్సిడీతో శనగ విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.రీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం చేతికొచ్చే ప్రధాన ఘట్టం. కాగా రెండు రోజుల నుంచి వాయుగుండం, తుపాను అంటుండటం, శుక్రవారం నుంచి వానలు మొదలు కావడంతో పంటలను కాపాడుకొనేందుకు యుద్ధ ప్రాతిపదికన వరి కోతలు చేపట్టారు. ఒకేసారి కోతలనడంతో యంత్రాలద్వారా కోతలు సాగించే దగ్గర రైతుల అవసరాన్ని అడ్డం పెట్టుకొని మిషన్ అద్దెలు విపరీతంగా పెంచేశారు. గంటకు ఎకరానికి రూ.వెయ్యి- రెండు వేలు ఉన్నది కాస్తా మూడు వేలు, అంతకుమించి వసూలు చేస్తున్నారు. ఒక్కో దగ్గర అంత పెట్టుకున్నా మిషన్లు అందుబాటులో లేవు. మిషన్లకూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కోతలు హడావిడిగా పూర్తి చేసినా ధాన్యం కొనే పరిస్థితి లేదు. ఆర్‌బికెలలో ముందస్తు రిజిస్ట్రేషన్లు, కూపన్ల తతంగం ఉండనే ఉంది. అప్పటి ధాన్యం అప్పుడు అమ్మబోతే తేమ శాతం నిబంధన అడ్డంకిగా మారింది. ఆర్‌బికెలలో స్టోరేజి సదుపాయాల్లేవు. ఆర్‌బికెల వెలుపల కూడా ధాన్యాన్ని అమ్ముకోవచ్చని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులివ్వడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు, మధ్యవర్తులను విధిలేని పరిస్థితుల్లో ఆశ్రయిస్తున్నారు. తుపాను నేపథ్యంలో మొత్తానికే పంటను పోగొట్టుకునేకంటే 'వచ్చిందే దక్కుళు' అని మద్దతు ధరలతో నిమిత్తం లేకుండా అయినకాడికి తెగనమ్ముకొని నష్టపోతున్నారు. చేలల్లో కోసిన వరి కంకులను, ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు, ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్ల కోసం వెతుకులాడుతున్నారు. ప్రభుత్వం కనీసం రైతులకు పట్టాలిచ్చేందుకూ ముందుకురావట్లేదు.ఇతర పంటలకూ..ఖరీఫ్ కందులు పూత దశ, గింజపట్టేదశలో ఉన్నాయి.

పెసలు, మినుములు కోతకొచ్చాయి. రాయలసీమలో వేరుశనగ గింజ అబివృద్ధి దశలో, కోతలకు వచ్చింది. పత్తి రెండవ తీత దశలో ఉంది. చెరకు గడ వృద్ధి దశలో ఉంది. ఇంతకుముందు కురిసిన వర్షాలకు కొన్ని చోట్ల వరి, పత్తి, మిర్చి, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. కోతల సమయంలో భారీ వర్షాలు పడితే పంటలు నీటిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక రబీ సాగుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. వరి నారుమళ్లు పెరుగుతున్నాయి. చాలా చోట్ల నాట్లు వేస్తున్నారు. శనగ, మినుము, పెసలు, మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారు. రబీలోనూ సాగు పుంజుకోలేదు. సీజన్‌లో రెండు మాసాలు పూర్తయినా 28 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. దాదాపు అన్ని పంటలూ తగ్గాయి. ఈపాటికే శనగ సాగు దాదాపు పూర్తి కావాల్సి ఉండగా ఆ పంట సైతం తగ్గింది. లిఫ్టులు, బోర్లు, కొన్ని ప్రాజెక్టుల కింద రబీలో వరి సాగు చేయొద్దని ప్రభుత్వం సూచించడంతో రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఇప్పుడు తుపాను అనడంతో వేసిన కొద్ది పంటలనూ నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులొస్తే ఉద్యానవన పంటలు, తోటలు, కూరగాయలకు నష్టమేనంటున్నారు.

# ఆర్ఎంపీ ఇంట్లో భారీగా ఔషధ మందులు లభ్యం

నంద్యాల డోన్ పట్టణంలో ఉదయం నుండి రెండు జిల్లాల డ్రగ్ ఇన్స్పెక్టర్లు మెడికల్ స్టోర్ లపై దాడులు నిర్వహిస్తున్నారు. వారికి వచ్చిన సమాచారం మేరకు డోన్ పట్టణంలో తారక రామారామ నగర్ లో ఆర్ఎంపి అంజి ఇంట్లో భారీగా నిల్వ ఉన్న మెడిసిన్ ను గుర్తించిన అధికారులు ఆ ఇంటికి తాళం వేసి ఇండటంతో దాదాపు రెండు గంటలు అక్కడే ఉండిపోమారు. చివరకు రెవిన్యూ అధికారుల సమక్షంలో వారి బంధువులతో తాళం పగలకొట్టి మెడిసిన్ ను సీజ్ చేశారు అలాగే డాక్టర్ ప్రిస్కిప్షన్ ,ఫార్మాసిస్ట్ లేకుండా మెడికల్ షాప్ లలో డ్రగ్స్ ,పెయిన్ కిల్లర్స్ ,స్టెరాయిడ్స్ విక్రయాలు నివాహిస్తున్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపి లీగల్ గా చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్స్పెక్టర్ పర్వీన్ సుల్తానా తెలిపారు..


# తెలి మంచు కురిసింది

తెలి మంచు కురిసింది తలుపు తీయవా ప్రభూ... అంటూ జాలువారే ఆ తీయని గానం ఘనీభవించేలా గురువారం మంచు కమ్మేసింది. పూజలు అందుకునే ప్రభువు పార్ధించాలనుకునే భక్తులు ఆ మంచు తెరలు చూసి తలుపులు మూసుకునే అంత దట్టంగా ఈ మంచు ఆవరించింది. పక్క మనిషిని గుర్తుపట్టేలా కనిపించనంతగా మంచు దుప్పటితో ముసిగేసంది. ముసుగుతన్నిన దుప్పటిని తప్పించుకునేందుకు సూర్యుడుకి చాలా సేపే పట్టింది. ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కంబలి రవి బింబాన్ని గట్టిగానే పట్టి ఉంచింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పాడేరు వంటే ఏజెన్సీ ప్రాంతంలో మాదిరిగా ఈ మంచు కురుస్తూనే ఉంది. తెల్లారింది మొదలు జీవనం సాగించడానికి ప్రయాసల పడే వారంతా ఏ మంచు పొరలను తప్పించుకుని వెళ్లడానికి చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది.నాలుగు లైన్ల జాతీయ రహదారిపై మూడంకెల వేగంతో రయ్న దూసుకుపోయే వాహనాలు ఈ పొగ మంచు వల్ల పది కిలోమీటర్ల వేగానికి పరిమితం కావలసి వచ్చింది.తెల్లారినప్పటికీ లైట్ల వెలుతురులోనే నెమ్మదిగా వాహనాలు కదిలాయి. మరికొన్ని వాహనాలను ఈ మంచుకి ప్రమాదాల భయంతో రోడ్డు పక్కన నిలిపేసారు. ప్రకృతి అందాలు ఈ మంచుకి అద్భుతంగా కనిపించాయి



# వైద్య వృత్తి గౌరవప్రదమైంది వైద్య అధికారులు సకాలంలో ఆరోగ్య కేంద్రంలో తప్పక ఉండాలి

**జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామ రాజు**




కడప కలెక్టరేట్ డిసెంబర్,15 వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని వైద్యులు బాధ్యతగా క్షేత్రస్థాయికి వెళ్లి వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామ రాజు అన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామ రాజు వైద్య అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.... వైద్యాధికారులు తప్పక ఉదయం 9.15 గంటలకు అంతా వారి వారి ఆరోగ్య కేంద్రాలలో హాజరై హాజరు పట్టికలో సంతకం చేసి క్రింది స్థాయి సిబ్బంది కూడా సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, అట్లు రాని వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే వైద్య అధికారులు తప్పక క్షేత్రస్థాయి గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించినప్పుడే గౌరవం అందుతుందని అన్నారు. వైద్యాధికారులు రోజు తమ దిన చర్య డైరీ ని వ్రాయాలని అన్నారు. మండల స్థాయి అధికారులతో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, మండలంలో జరుగుతున్న విషయాలను తెలుసుకొని చర్యలు తీసుకొని వైద్య సేవలు అందించాలని తెలిపారు.ముఖ్యంగా నాలుగు అంశాలలో వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని మొదటగా హాజరు ను తప్పక పాటించాలని, క్రింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్యాధికారి స్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు ఆరోగ్య కేంద్రంలో ఎవరో ఒకరు ఉండి వైద్య సేవలు అందించాలని చెప్పారు. ముఖ్యంగా గర్భవతుల స్థితిగతులను తప్పక నిర్ణీత రిజిస్టర్ నందు నమోదు చేయాలన్నారు. ఏఎన్ఎం, ఆశ, సి హెచ్ ఓ లతో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకొని తగు సూచనలు చేయాలని చెప్పారు. సిహెచ్ ఓలు ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి కేంద్రాలకు వచ్చిన గర్భవతుల వివరాలను సేకరించి నమోదు చేయాలని అన్నారు. అలాగే గర్భవతులకు నిర్దేశించిన సమయంలో పరీక్షలు చేసి తగు సూచనలు చెప్పాలని అన్నారు. గర్భవతుల బరువు తదితరాలను ఏ మాసానికి ఆ మాసం లో చూసి వైద్య సేవలు అందించాలని అన్నారు. 0 రెండు సంవత్సరాలు, 2 ఆరు సంవత్సరాలు గల చిన్నపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో వ్యాక్సినేషన్ చేయాలని అన్నారు. ఎత్తుకు తగ్గ బరువు, బరువుకు తగ్గ ఎత్తు ఉండే విధంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అలాగే వారి తల్లులకు తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వారి వారి ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వచ్చిన రోగులతో ఆప్యాయంగా పలకరించి వైద్య సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే నాగరాజు, వైద్యులు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు

# వేసవిలోనే ఏటిగట్ల పనులుచేపట్టాలి

ఏలూరుపశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మాజీ మంత్రి హరి రామ జోగయ్య ప్రభుత్వానికి మరోసారి పశ్చిమగోదావరి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి తెలియపరచాలంటూ లేఖ రాసారు.ఇటీవల వరద ప్రభావంతో లంక గ్రామాల్లో దొడ్డిపట్ల, యలమంచిలి లంక, కనకయలంక, బాడవ నరసాపురం వరకు కూడాఏటిగట్లు పటిష్టం గా లేకపోవడం వల్ల గ్రామస్తులే ఇసుక మట్టి బస్తాలతో రాత్రింబవళ్లు ఏటిగట్లను పర్యవేక్షించుకోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని , వచ్చే సంవత్సరం లంక గ్రామాలకు వరద ప్రభావితం వచ్చేలోపులో అయినా ఈ వేసవి సమీపిస్తున్న సందర్భంగా వేసవికాలంలోనే ఏటిగట్ల పటిష్టతకు పనులు చేపట్టాలని లేఖ ద్వారా కోరారు. ఈ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు బిల్లులు సరిగా చెల్లించకపోవడం వల్ల ఏ పని టెండర్లను పిలిచిన కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు

# సుప్రభాత సేవలో సూపర్ స్టార్ రజనీకాంత్

తిరుమల తిరుమల శ్రీవారిని సూపర్ స్టార్ రజనీకాంత్ దర్శించుకున్నారు.. గురువారం ప్రాతఃకాల సమయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి నిర్వహించే సుప్రభాత సేవలో రజనీకాంత్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. స్వామి వారి దర్శనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు..

# తిరుమలలో ప్రముఖులు

తిరుమల తిరుమల శ్రీవారిని ఏపీ కార్మికశాఖ మంత్రులు గుమ్మనూరు జయరామ్,ధర్మాన ప్రసాద రావు,ఎమ్మెల్యే శ్రీదేవి దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సమేతంగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శబరిమలై యాత్రకు బయల్దేరిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి



నందికొట్కూరు, డిసెంబర్ 15 నందికొట్కూరు పట్టణ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అయ్యప్ప స్వామి మాల ధరించి 41 రోజులు భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో కూడిన దీక్ష చేపట్టి, ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా సామాన్య జీవనం, ఏక భుక్తం వంటి కఠిన నిబంధనలు పాటిస్తూ... ఇరుముడి సమర్పించడానికి అయ్యప్ప మాలధారణ బృందంతో శబరిమలలోని 18 మెట్లను ఎక్కి మణికంఠ స్వామి వారిని దర్శించుకోవడానికి శబరిమలై యాత్ర కు బయల్దేరి వెళ్లిన నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి స్వామి.ముందుగా పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్ గారు, కౌన్సిలర్ లు అబ్దుల్ రవూఫ్, మనపాడు అశోక్, లాలు ప్రసాద్ వైసిపి నాయకులు బొట్టు రవి, వి.ఆర్ శ్రీను, మధుసూదన్ రెడ్డి, పి.రమేష్, శాలి భాష, మధు, సూర్య రెడ్డి, జయన్న తదీతరులు చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి స్వామి గారికి పూలమాలలతో సత్కరించారు.

# ఎస్పీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి ఎస్పీ, శ్రీ కె. రఘువీర్ రెడ్డి





నంద్యాల :–.నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయం నందు ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష

చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి కార్యక్రమం జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి గారి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు (1901 మార్చి 16 – 1952 డిసెంబరు 15) ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనవాడు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు. స్వాతంత్ర్యం అనంతరం ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం తరఫున నిర్మాణ కార్యక్రమ ఆర్గనైజరుగా శ్రీరాములు పనిచేశారు. ఈ నేపథ్యంలో.. ఆంధ్రులకు ప్రత్యేకంగా రాష్ట్రం లేకపోవటం వల్ల నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించటంలో ఎన్నో ఇబ్బందులు అనుభవించాల్సి వచ్చింది. ఆంధ్ర ప్రాంతంలో ఏ పని జరగాలన్నా రాష్ట్రం లేకపోతే సాధ్యం కాదని నిర్ణయించుకున్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరజీవి యైన మహాపురుషుడు అని కొనియాడినాడు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆర్ర. మణ గారు ,ఎఅర్ అడిషనల్ ఎస్పీ జి .చంద్రబాబు గారు ఎ ఆర్ . సిబ్బంది ,జిల్లా ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం మరువనిది : టిడిపి

### కోట్ల క్యాంపు కార్యాలయంలో... పొట్టి శ్రీరాములు గారి 70 వ వర్ధంతి

ఎమ్మిగనూర్ మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి× గారి ఆదేశాల మేరకు గురువారం ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయం నందు అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 70 వ వర్ధంతి కార్యక్రమాన్ని టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు అర్పించి అమరజీవి యైన పొట్టి శ్రీరాములు మహాపురుషుడు అని, భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఏర్పాటుకు కారణభూతుడై, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల సాధన కోసం తన జీవితాంతం కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. నేటితరం ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలు ఎన్నటికీ మరచి పోరని, తెలుగు ప్రజల హృదయాలలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో... తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి. అల్తాఫ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు కె.యం.డి. జబ్బార్, గోరా బాషా, మహబూబ్ బాషా, 16 వ వార్డు నాయకులు బెస్త హనుమంతు, గుడికల్ గ్రామ టిడిపి నాయకులు కోలంట్ల నాగరాజు, కోలంట్ల వెంకటేష్, ఆఫ్గాన్ వలి భాష, కోట్ల క్యాంప్ ఆఫీస్ ఇన్చార్జులు కోడెగంటి శంకరన్న, యన్. ఆదెన్న తదితరులు పాల్గొన్నారు.

## వారిని ఎస్టీ జాబితాలో చేర్చితే తీవ్ర పరిణామాలు

నంద్యాల :–బోయ, బెంతో, ఒరియా తదితర సామాజిక వర్గాలను ఎస్టీ జాబితాల్లో చేర్చితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర పరిణా మాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు రాజు నాయక్ ప్రభుత్వాలను హెచ్చరించారు. గురువారం ఓ ప్రకటనలో రాజు నాయక్ మాట్లాడుతూ ఆయా సామాజిక వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ నిరసన తెలిపామని ప్రభుత్వం మౌనంగా ఉండడం ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని ఈ ప్రభుత్వం కూడా కొనసాగించడం దురదృష్టకరమని, రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో గిరిజను లకు గెలుపు ఓటములు శాసించగల సత్తా ఉందన్న విషయాన్ని గ్రహించాలని వైకాపా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం జీవో నంబరు 52 ద్వారా విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్యామ్యుల్ ఆనంద్ కుమార్ తో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి బోయ, బెంతో, ఒరియా సామాజిక వర్గాలను గిరిజన జాబితాలో చేర్చాలని నిర్ణ యించడం సరికాదని, వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అఖిలభారత మహాసభలకు సంఘీభావంగా జెండా ఆవిష్కరణలు.

నందికొట్కూరు డిసెంబర్ 15 ,డిసెంబర్ 13వ తేదీ నుండి 16వ తేదీ వరకు మహాసభలు కేరళ రాష్ట్రంలోని త్రిశూర జిల్లాలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నందికొట్కూరు మున్సిపాలిటీ పట్టణంలోని వాల్మీకి నగర్ సెంటర్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు సీనియర్ నాయకులు వా. ఉస్మాన్అధ్యక్షత వహించగా రైతు నాయకులు డి దాదాభాష. జెండాను ఆవిష్కరించారు. అనంతరం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఖ. వెంకటేశ్వర్లు ఉస్మాన్ మాట్లాడుతూవ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల శక్తులకు అప్పగించేందుకు ప్రజా సమీకంగా మూడు నల్ల చట్టాలను బిజెపి ప్రభుత్వం తెచ్చిందని అప్పుడు దేశంలో ఉన్న దాదాపు 540 రైతు సంఘాలు ఐక్యమై నిర్బంధాలను ఎదుర్కొని ఏడాది పాటు సాగిన ఉద్యమానికి తొలగిన బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మద్దతు ధరల చట్టం ఇస్తామని విద్యుత్తు సవరణ చట్టం నుండి వ్యవసాయ రంగానికి భద్రత. కల్పిస్తామని.ఉద్యమ సందర్భంగా రైతులపై పెట్టిన కేసులో ఉపసంహరిస్తామని వ్రాతపూర్వకంగా హామీ ఇచ్చిందని అన్నారు విద్యుత్తు చట్టాన్ని యధావిధిగా పార్లమెంట్లో ప్రవేశ పెట్టడం జరిగింది. తక్షణమే రైతు ఉద్యమంలో పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని 2020 చట్టం విద్యుత్ బిల్లును వెనుక తీసుకోవాలని రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని మానుకోవాలని రాబోయే కాలంలో ఈ మహాసభలో చర్చించి ఉద్యమాలు నిర్వహిస్తారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో గెలిచి మూడు సంవత్సరాల కాలం అయిన రైతులకు ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేసింది లేదన్నారు నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం లో శ్రీశైలం బ్యాక్ వాటర్ లో వేల ఎకరాలు సర్వం కోల్పోయి నా వారికి 98 జీవో కింద నేటికిని అనేక మందికి తక్షణమే 98 జీవో కింద ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నందికొట్కూరు ప్రాంతంలోని ఎస్ ఆర్ బి సి ఎస్ ఆర్ ఎంసి సమస్యల పైన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రైతాంగంతో కలిసి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో. రైతు నాయకులు రామసుబ్బయ్య గోకారి వెంకట చిన్ని గౌడ్. వ్యవసాయ కార్మిక సంఘం ల. నాయకులు నాగరాజు కార్మికులు ఎస్ మా భాష ఉపేంద్ర రంగా. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి కి ఘన నివాళులు అర్పించిన ఆర్యవైశ్యులు

దర్శి అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ప్రకాశం జిల్లా దర్శి లో ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో దర్శి నగర పంచాయతీ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు మరియు జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహాలు కు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు కొల్లా ఉదయ్ భాస్కర్, ,ప్రధాన కార్యదర్శి పరుచూరి సుబ్రహ్మణ్యం,యువజన సంఘం అధ్యక్షుడు మునగా అరుణ్ కుమార్ ,మరియు ఆర్యవైశ్య సంఘం సభ్యులు బొగ్గవరపు సుబ్బారావు, చందలూరి కొండయ్య శెట్టి , అచ్చుత సత్యనారాయణ , అచ్యుత శరత్, గునుపూడి సత్యనారాయణ,సూరే పూర్ణ, సూరే కిరణ్ , మువ్వల శ్రీనివాసరావు వంకదారి కుమార్ , తదితరులు పాల్గొన్నారు

## టిల్లు నుంచి హీరోయిన్స్ అందుకే పారిపోతున్నారా?

'టిల్లు 2'.. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో అత్యంత హాట్ టాపిక్ గా మారుతున్న సినిమా ఇది. యంగ్ హీరో సిద్దూ జొన్నలగడ్డ హీరోగా నటించి రచయితగానూ వర్క్ చేసిన మూవీ 'డీజే టిల్లు'. విమల్కృష్ణ దర్శకత్వంలో సితార ఎంటర్టైన్ మెంట్స్ బ్యానర్ పై యంగ్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ నిర్మించాడు. కేవలం రూ. 4 కోట్ల లోపు బడ్జెట్ తో నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద దాదాపు భారీ వసూళ్లని రాబట్టి చిన్న సినిమాల్లో బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుంది. దీంతో ఈ మూవీకి సీక్వెల్ చేయాలని ప్లాన్ చేసుకున్నారు.క్లైమాక్స్ లోనే సీక్వెల్ కి హింట్ ఇచ్చిన టీమ్ అన్నట్టుగానే 'టిల్లు 2' పేరుతో



సీక్వెల్ ని మొదలు పెట్టింది. డైరెక్టర్ మారిపోయాడు.. విమల్ కృష్ణ స్థానంలో మల్లిక్ రామ్ వచ్చి చేరాడు..సీక్వెల్ లో వుండాల్సిన హీరోయిన్ నేహాశెట్టి కూడా మారిపోయింది.తన స్థానంలో అనుపమ పరమేశ్వరన్ వచ్చి చేరింది. షూటింగ్ మొదలైంది. అక్కడ నుంచి 'టిల్లు 2' తిప్పలు షురూ.. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తప్పుకుంది. ఆ స్థానంలో 'ప్రేమమ్' ఫేమ్ మడోన్నా సెబాస్టియన్ వచ్చేసిందని ప్రచారం జరిగింది.తను కూడా ఈ ప్రాజెక్ట్ కి టాటా చెప్పేసిందట. ప్రస్తుతం 'హిట్ 2' ఫేమ్ మీనాక్షీ దీక్షిత్ లేదా కేతిక శర్మలలో ఒకరిని ఎంపిక చేసుకునే అవకాశం వుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా సినిమా ప్రారంభం లోనే హీరోమయిన్ లు వాకౌట్ చేస్తూ బయటికి వెళ్లిపోవడానికి అసలు కారణం ఏంటని ఎందుకు హీరోయిన్ లు ఈ మూవీలో నటించడానికి ఆసక్తిని చూపించడం లేదనే చర్చ మొదలైంది. ఇందు కు కారణం హీరో రైటర్ సిద్దూ అని అతనితో వుంటే ఇంటిమేట్ సీన్ వల్లేనని తెలుస్తోంది. 'డీజే టిల్లు'లో రాధిక పాత్రలో నటించిన నేహాశెట్టితో సిద్దూ జొన్నల గడ్డ లిప్ లాక్ సీన్ లు వున్న విషయం తెలిసిందే. అయితే సీక్వెల్ లో మాత్రం అంతకు మించి ఇంటిమసీ సీన్స్ వున్నాయట. అవే హీరోయిన్ లని భయపెడుతున్నాయని సిద్దూతో అవి చేయలేకే వచ్చిన హీరోయిన్ వచ్చినట్టే సెట్ లో షూటింగ్ మొదలు కాకుండానే పారిపోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. హీరో సిద్దూ జొన్నలగడ్డ ఈ మూవీకి రైటర్ కూడా తనే కావడంతో ఓ రేంజ్ లో ఇంటిమేట్ సీన్ లని రాసాడని చెబుతున్నారు.ఆ సీన్ లలో నటించడానికి హీరోయిన్ లు ఇబ్బందిపడుతున్నారట. ఆ కారణం వల్లే ఏమీ చెప్పలేక .. ఆ సీన్ లలో నటించలేక హీరోయిన్ లు ఫైనల్ గా ఈ ప్రాజెక్ట్ నుంచి వాకౌట్ చేస్తున్నారని ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో గుసల గుసలు వినిపిస్తున్నాయి. మరి ఇప్పటికైనా ఆ సీన్ ల డోస్ తగ్గిస్తారో.. హీరోయిన్ గా మీనాక్షీ దీక్షిత్ కేతిక శర్మలలో ఎవరిని ఫైనల్ చేసుకుంటారో వేచి చూడాల్సిందే.


## 13 ఏళ్ల తర్వాత 'వైశాలి' కాంబో మరో థ్రిల్లర్ తో!




ఆది పినిశెట్టి–అరివళగన్–శంకర్ కాంబినేషన్ లో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'ఈరమ్' కోలీవుడ్ లో ఎంత పెద్ద విజయం సాధించిందో చెప్పాల్సిన పనిలేదు. అదే సినిమా తెలుగులో 'వైశాలి' టైటిల్ తో అనువాదమై ఇక్కడా మంచి విజయాన్ని అందుకుంది. సినిమా ఆద్యంతం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. రెగ్యులర్ థ్రిల్లర్ చిత్రాలకు భిన్నంగా రూపొందిన సినిమా ఇది. థ్రిల్లర్ జోనర్ కి నవ్య పంథాని పరిచయం చేసిందనొచ్చు. పిన్ టూ పిన్ ప్రతీ సన్నివేశం ఎంతో ఆసక్తికరంగా మలిచాడు దర్శకుడు. అందుకే శంకర్ లాంటి లెజెండ్ ఈ చిత్రాన్ని నిర్మించడా నికి ముందుకొచ్చారు. ఈ చిత్రంతో ఆదికి నటుడిగా మంచి పేరొచ్చింది. నందా దొరై రాజ్.. శింధు మీనన్ పాత్రలు అంతకు మంచి హైలైట్ అయ్యాయి. సినిమాకి ఈ రెండు పాత్రలు పిల్లర్ లా నిలిచాయి. అంతటి సక్సెస్ ఫుల్ కాంబినేషన్ మళ్లీ చేతులు కలపలేదు.ఈనేపథ్యంలో తాజాగా అదే దర్శకుడు ఆదితో మరో చిత్రాన్ని ప్రకటించారు. 'సబదం' అనే టైటిల్తో మరో హారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆది పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ సినిమాకి సంబంధించిన గ్రిప్పింగ్ పోస్టర్ ఒకటి రిలీజ్ చేసారు. రద్దీగా ఉండే గబ్బిలాలు ఓ భారీ చెవిలోకి ప్రవేశించడం. వింతైనా గబ్బిలాల శబ్దం..ప్రతిధ్వనులు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.ఇది డిఫరెంట్ కాన్సెప్ట్ హారర్ థ్రిల్లర్ గా హైలైట్ అవుతుంది. పోస్టర్ క్యూరియాసిటీని పెంచుతుంది. సినిమాకి సంబంధించి పనులు మొదలైనట్లు తెలుస్తోంది. కాన్సెప్ట్ పోస్టర్ తోనే సినిమాకి బజ్ మొదలైంది.మరి 'వైశాలి' కాంబో తెరపై ఎలా కనిపిస్తుందో చూడాలి. 7ఉ ఫిల్మ్స్ – ఆల్ఫా ఫ్రేమ్స్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ను నిర్మిస్తున్నాయి.వైశాలి కి సంగీతం అందించిన ఎస్.ఎస్ థమన్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తుండటం విశేషం. మ్యూజిక్ డైరెక్టర్ గా థమన్ హవా నడుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలు అంతకంతకు పెరుగుతున్నాయి. తెలుగు–తమిళంలో ఏకకాలంలో ఈ చిత్రం ప్రారంభం కానుంది.

## రవితేజ తన మొత్తం కెరీర్ లో ఇలా ఇదే ప్రథమం

మాస్ మహారాజా రవితేజ హీరోగా త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో రూపొందిన ధమాకా సినిమా డిసెంబర్ చివరి వారంలో క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయ్యింది. భారీ అంచనాల నడుమ రూపొందిన ఈ సినిమా పై రవితేజ గతంలో ఎప్పుడూ లేనంత నమ్మకంతో ఉన్నాడని



ఆయన సన్నిహితులు చెబుతున్నారు.రవితేజ కెరీర్ ఆరంభం నుండి కూడా ప్రమోషన్ విషయంలో పెద్దగా యాక్టివ్ గా కనిపించడు. తన సినిమాల ప్రమోషన్ విషయాలను పెద్దగా పట్టించుకోని రవితేజ ఈసారి మాత్రం రెండు వారాల ముందు నుండే ధమాకా సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీ బిజీగా ఉన్నాడు. పూర్తిగా రెండు వారాలను సినిమా ప్రమోషన్ కోసం కేటాయించాలని నిర్ణయించుకున్నాడట.కెరీర్ లో ఎప్పుడు కూడా ఒక సినిమా కోసం రవితేజ ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నది లేదు. పైగా ఈ సారి ధమాకా సినిమా విడుదల సందర్భంగా ఫ్యాన్స్ తో ఫోటో సెషన్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఎక్కడ చూసినా కూడా ధమాకా చర్చ జరిగే విధంగా రవితేజ సాధ్యం అయినంత ఎక్కువ పబ్లిసిటీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు.టీవీ కార్యక్రమాలు.. ప్రత్యేక షో లు మరియు ఇంటర్వ్యూలు ఇలా ప్రతి ఒక్కటి కూడా ధమాకా సినిమా స్థాయిని పెంచే విధంగా రవితేజ ప్లాన్ చేశాడట. ఈ సినిమా లో రవితేజ ద్విపాత్రాభినయం చేశాడట. సినిమా పై ఉన్న నమ్మకంతోనే ఆయన ప్రమోషన్స్ విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాడు అంటున్నారు.ఇదే శ్రద్ద తన అన్ని సినిమాలకు కూడా చూపించాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో సినిమాల యొక్క మేకింగ్ కంటే కూడా ఎక్కువ ప్రాముఖ్యత ను సినిమా ప్రమోషనల్ ఈవెంట్స్ మరియు ఇతర ప్రమోషనల్ విషయాలు చూపిస్తున్నాయి. అందుకే ధమాకా సినిమా సక్సెస్ అవుతుందనే అంతా ఆశిస్తున్నారు.

## కోల్‌కతా నైట్‌రైడర్స్ కీలక నిర్ణయం..! అబుదాబి కెప్టెన్‌గా సునీల్ నరైన్



యూఏఈ ఇంటర్నేషనల్ టీ20 లీగ్ తొలి సీజన్ వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఈ లీగ్‌లో అబుదాబి నైట్ రైడర్స్ కెప్టెన్‌గా వెస్టిండీస్ విధ్వంసకర ఆల్ రౌండర్ సునీల్ నరైన్ నియమితుడయ్యాడు.కాగా అబుదాబి నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీని ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.గత కొన్ని ఐపీఎల్ సీజన్‌ల నుంచి సునీల్ నరైన్ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలోనే అతడికి అబుదాబి జట్టు పగ్గాలు కేకేఆర్ యాజమాన్యం అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఇక టీ20 క్రికెట్‌లో సునీల్ నరైన్ అద్భుతమైన ఆటగాడు.అతడికి 400 పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. కాగా అబుదాబి నైట్ రైడర్స్ జట్టులో నరైన్‌తో పాటు ఆండ్రీ రస్సెల్, రవి రాంపాల్, అకేల్ హ్సేన్, రేమాన్ రీఫర్, కెన్నార్ లూయిస్ వంటి విండీస్ ఆటగాళ్లు ఉన్నారు. ఇక కెప్టెన్‌గా ఎంపికైన అనంతరం సునీల్ నరైన్ స్పందించాడు.”అబుదాబి నైట్ రైడర్స్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇది ఒక కొత్త సవాలు. ఎందుకంటే ఇప్పుడు నేను నా బ్యాటింగ్, బౌలింగ్‌పై కాకుండా జట్టు మొత్తం ఆటతీరుపై దృష్టిపెట్టాలి. నాకు నైట్ రైడర్స్ గ్రూపుతో ప్రత్యేకమైన అనుబంధం ఉంది.చాలా ఫ్రాంఛైజీలో లీగ్‌ల్లో నైట్ రైడర్స్‌కు సంబంధించిన జట్లు ఉన్నాయి. ప్రతీ చోటా వాళ్ల జట్టులో నేను భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. ఇక యూఏఈలో నేను చాలా క్రికెట్ ఆడాను. అక్కడి పరిస్థితులు బాగా తెలుసు. కాబట్టి జట్టును విజయ పథంలో నడిపించడానికి ప్రయత్నిస్తాను అని సునీల్ నరైన్ పేర్కొన్నాడు.

## రాణించిన పుజారా, శ్రేయస్.. 404 పరుగులకు భారత్ ఆలౌట్

ఛాటోగ్రామ్ వేదికగా బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 404 పరుగులకు ఆలౌటైంది. 278 పరుగులతో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా అదనంగా మరో 126 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను ముగించింది.భారత బ్యాటర్లలో ఛతేశ్వర్ పుజారా(90), శ్రేయస్ అయ్యర్(86), అశ్విన్(58) పరుగులతో రాణించారు.ఆఖరిలో కుల్దీప్ యాదవ్(40) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**